ఎవరికీ చెప్పుకోలేని బాధలు..

- ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళల అవస్థలు
- కార్యాలయాల్లో టాయిలెట్లకు తాళం
- పనులపై వచ్చిన ప్రజలు ఆరుబయటనే మూత్ర విసర్జన
- స్వచ్ఛ ఆంధ్రా లక్ష్యానికి నిలువునా తూట్లు
- చర్యలు తీసుకోవాలని ఉన్నత అధికారులకు మనవి



శిథిలావస్థకు చేరుకున్న బద్వేలు తహసీల్దారు కార్యాలయం



శిథిలావస్థకు చేరుకున్న బద్వేలు తహసీల్దారు కార్యాలయం మరుగుదొడ్లు



బద్వేలు ఎంపీడీఓ కార్యాలయంలో అధ్వాన్న స్థితిలో మరుగుదొడ్డి

బద్వేలు : నిత్యం జనసమూహం అధికంగా ఉండే తహసీల్దారు, మండల పరిషత్, పోలీసుస్టేషన్, ఆర్‌డీఓ ఆఫీసు, వెలుగు, గృహ నిర్మాణశాఖ, బ్యాంక్‌లు తదితర కార్యాలయాల్లో మహిళలకు అవసరమైన కనీస వసతులు కరువైయ్యాయి. ఇటీవల కాలంలో మహిళలు వివిధ పనులపై ప్రభుత్వ కార్యాలయాలకు వస్తున్నారు. అక్కడ సంబంధిత అధికారులు అందుబాటులో లేక గంటల కొద్దీ వేచి ఉండవలసి వస్తోంది. తహసీల్దారు కార్యాలయంలో మరుగుదొడ్డికి నీటి సౌకర్యం లేదు. హౌసింగ్ కార్యాలయానికైతే అసలు టాయిలెట్ లేదు. దీంతో మహిళలు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. పట్టణాల్లోని కార్యాలాయాల దగ్గర అయితే ఆరుబయట కూడా మూత్ర విసర్జన చేసేందుకు ఖాళీ స్థలం కన్పించడంలేదు. కాగా ఎంపీడీఓ కార్యాలయంలో టాయిలెట్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఒక వేళ తమసమస్య కార్యాలయంలో పని చేసే మహిళా ఉద్యోగులకు చెప్పు కున్నా కొంత మంది వారి బాధలను పట్టించు కోవడంలేదు. అక్కడి మరుగుదొడ్డిని అధికారులు సొంతానికి వాడు కుంటారట.. ఎవరినీ పోనీవరట.. ఈవిధంగా పురుషులైన పై అధికారులకు తమ బాధ చెప్పుకోలేక మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

వైఎస్సార్ కడప జిల్లాలో 51 మండలాల్లో తహసీల్దారు కార్యాలయాలు ఉన్నాయి. దాదాపు అన్ని మండల కార్యాలయాల్లో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ అవి ఆయా కార్యాలయాల సిబ్బంది అవసరాలకు మాత్రమే ఉపయోగపడుతున్నాయి. సిబ్బంది అవసరమైనప్పుడు ఉపయోగించుకోవడం అవసరం తీరాక తాళాలు వేయడం పరిపాటిగా మారింది. కార్యాలయాలకు ప్రతి రోజూ వచ్చే ప్రజలకు మాత్రం అవి ఏమాత్రం ఉపయోగపడటంలేదు. ముఖ్యంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి సమస్యల పరిష్కారం కోసం పెద్ద సంఖ్యలో వచ్చే అర్జీదారులు అనేక ఇక్కట్లు పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు మరుగుదొడ్ల లేక వారి అగచాట్లు దమనీయం. కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులే బాధితులుగా ఉంటున్నారు. వారికి ప్రత్యేకంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంలేదు. ఇక పోతే ప్రైవేట్ భవనాల్లో నడుస్తున్న ప్రభుత్వ కార్యాలయాల్లో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంది. అయా చోట్ల టాయిలెట్లు ఉన్నా లేనట్లే. నిర్వహణ మరీ అధ్వానంగా ఉంది. అటువంటి చోట్ల మగ ఆడ తేడా లేకుండా ఉద్యోగులంతా బాధితులే అవుతున్నారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర వంటి బారీ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నాయి. ఫలితంగా ×బహిరంగ మలమూత్ర విసర్జన రహిత¥లక్ష్యానికి విఘాతం కలిగిస్తోంది. ఉన్నత అధికారులు దీనిపై దృష్టి సారించి పరిస్థితిని చక్క దిద్దే చర్యలు చేపట్టాలని ప్రజలుకోరుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకువెళ్లాలని ప్రజలు.. కొందరు ప్రభుత్వ ఉద్యోగులు కోరుతున్నారు.

క్లుప్తంగా

బ్రహ్మంగారి నిత్య కల్యాణానికి విరాళం



బ్రహ్మంగారి నిత్య కల్యాణానికి విరాళం అందజేస్తున్న వెంకట శరత్ చంద్ర కుటుంబ సభ్యులు

బ్రహ్మంగారిమఠం : శ్రీపోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ నిత్యకల్యాణానికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన నల్లపాటి వెంకట శరత్ చంద్ర దంపతులు రూ. 1,000,11 లక్షల నగదును పిట్ పర్సన్ శంకర్ బాలాజీకి అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ బ్రహ్మంగారి నిత్య కల్యాణం గురించి ప్రతికల ద్వారా తెలుసుకొని బి.మఠంకు వచ్చి విరాళం అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో పూర్వపు మఠాధిపతి తమ్ముడు వీరభద్రాచారి, దేవస్థానం పూజారులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

కలసపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ బోదనబోయిన నిర్మలదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మహబూబ్‌బీ తెలిపారు. రెవెన్యూ, వైద్యం, విద్య, తాగునీరు, ఉపాధి, వ్యవసాయం తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

నేటి తరం యువతకు ఆదర్శం తిరుపతిరెడ్డి

పోరుమామిళ్ల : చివరి శ్వాసవరకు ప్రజల కోసం ప్రజల కొరకు, రైతుల సమస్యలపై పోరాటం చేసిన నిస్వార్థ కమ్యూనిస్టు తిరుపతిరెడ్డి అని సీపీఐ ఏరియా కార్యదర్శి పిడుగుమస్తాన్, మండల కార్యదర్శి రవికుమార్, జిల్లా సమితి సభ్యులు వెంకటరమణ తెలిపారు. రాజాసాహేబ్‌పేటకు చెందిన కల్లూరి తిరుపతిరెడ్డి 10వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఆయన స్థూపం వద్ద పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటితరం యువతకు ఆదర్శం తిరుపతిరెడ్డి అన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

చాపాడు : రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దారు రమాకుమారి పేర్కొన్నారు. మండలంలోని వెదురూరు గ్రామంలోని గ్రామ సచివాలయంలో రైతులతో భూ సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రెండు నెలల క్రితం రెవెన్యూ గ్రామ సదస్సులో భాగంగా గ్రామాలలో సమావేశాలు నిర్వహించిన రైతుల నుంచి భూ సమస్యలపై ఫిర్యాదులకు స్వీకరించామన్నారు. అనంతరం పలు రకాలైన సమస్యలను పరిష్కరించామని, మిగిలిన సమస్యలను కూడా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

27న ఉపసర్పంచ్ ఎన్నిక

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక ఈనెల 27న నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్డీ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామాంజనేయులరెడ్డి శుక్రవారం తెలిపారు. ఉప సర్పంచ్‌గా ఉన్న బీరం రాఘవేంద్రరెడ్డి తన పదవికి రాజీనామా చేయడంతో ఎన్నిక జరగనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలో మొత్తం 20 మంది వార్డు సభ్యులు ఉండగా వారిలో ఒకరిని ఉప సర్పంచ్‌గా ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పంచాయతీ పరిధిలోని వార్డు మెంబర్లకు ఎన్నిక నోటీసులను గ్రామ కార్యదర్శి రామకృష్ణ అందించారు. ఈనెల 27న హౌసింగ్ బోర్డు కాలనీలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో వార్డు మెంబర్లు చేతులు ఎత్తే విధానం ద్వారా ఉప సర్పంచ్‌ను ఎన్నుకోనున్నట్లు ఈఓపీఆర్డీ వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మైదుకూరు : మండలంలోని వనిపెంటలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో 5, 6 తరగతుల ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వి.నిర్మలరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వ తేదీలోపు వెనుకబడిన తరగతులకు చెందిన బాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27, 28 తేదీల్లో జరుగుతుందని తెలిపారు. వివరాలకు 9398207776, 8374320371 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఎస్సీ వర్గీకరణపై సంబరాలు

ప్రొద్దుటూరు : సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఎస్సీ వర్గీకరణ తీర్మానాన్ని ఆమోదించిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలకు ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ మాదిగ కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఏపీ ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో శుక్రవారం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ యువసేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాకే నారాయణస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు కేశేపల్లి నాగేంద్ర పాల్గొన్నారు.

జెండా ఉత్సవం

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని నాగాయపల్లె గ్రామంలో కులమతాలకు అతీతంగా దస్తగిరి స్వామి జెండా ఉత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం జెండాను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం గ్రామ గవిని వద్ద గవిని దోషం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జెండాను గ్రామంలోని దస్తగిరి స్వామి దర్గాలో ప్రతిష్ఠించారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

బద్వేలు అర్బన్ : డ్రగ్స్ రహిత సమాజం కోసం యువత కృషి చేయాలని ఎక్సైజ్ సీఐ బి.సీతారామిరెడ్డి తెలిపారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణపై రూపొందించిన గోడపత్రాలను శుక్రవారం సీఐ ఆవిష్కరించి మాట్లాడారు. యువత మత్తు, మాదకద్రవ్యాల బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, యువత చెడు వ్యసనాల జోలికి వెళ్ళకుండా మంచి మార్గంలో నడవాలని సూచించారు. అలాగే డ్రగ్స్ రహిత సమాజం కోసం యువతకు అవగాహన కల్పించే క్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు చేస్తున్న కృషి అభినందనీయమని ఈ సందర్భంగా వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ గౌస్‌బాషా, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్, రూరల్ అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు యువరాజ్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రొద్దుటూరు క్రైం : యువతను విపరీతంగా ఆకర్షిస్తూ వారి భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్న క్రికెట్ బెట్టింగ్ మహమ్మారిని అరికడతామని ప్రొద్దుటూరు డీఎస్పీ భావన తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ గతంలో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడి నేర చరిత్ర గల వారి కదలికలపై నిఘా ఉంచినట్లు పేర్కొన్నారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహించడం, వారికి సహకరించడం లాంటివి చేస్తే కేసులు నమోదు చేసి వారి ఆస్తులను ప్రభుత్వానికి అటాచ్ చేయించడానికి వెనుకాడమని డీఎస్పీ తెలిపారు. ఈ బెట్టింగ్ మహమ్మారిని అరికట్టే క్రమంలో ఈ ఏడాది ఇప్పటికే 16 మంది బెట్టింగ్ నిర్వాహకులను అరెస్టు చేసి వారిపై 14 కేసులు నమోదు చేశామన్నారు. వారి వద్ద నుండి రూ.5,42,000 నగదు, సెల్ ఫోన్లు ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకుని కోర్టుకు సమర్పించినట్లు తెలిపారు.

'రాజోలి' నిర్మాణంపై ప్రకటన చేయాలి

చాపాడు : 2.95 టీఎంసీల సామర్థ్యంతో రాజోలి జలాశయం నిర్మించాలని వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజోలి జలాశయం కంటే మించిన ప్రాజెక్టు ఏమీ లేదని, దీనిని నిర్మిస్తే 92వేల ఎకరాల ఆయకట్టులో రెండు పంటలు పండించుకునేందుకు సంమృద్ధిగా సాగునీరు లభిస్తుందని తెలిపారు. మహానాడు వైఎస్సార్ జిల్లాలో జరుగనున్న నేపథ్యంలో జిల్లా అభివృద్ధిపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

నక్కలదిన్నె రామాలయంలో ప్రత్యేక పూజలు

చాపాడు : మండలంలోని నక్కలదిన్నె గ్రామంలోని రామాలయం వద్ద శుక్రవారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. గత నెలలో గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారామ సమేత హనుమాన్ విగ్రహ శిఖర ప్రతిష్ఠ వేడుకలు నిర్వహించారు. ప్రతిష్ఠ వేడుకల అనంతరం 41వ రోజుల తర్వాత రామాలయ సన్నిధిలో శుక్రవారం రుద్ర హోమం, నవగ్రహ హోమం నిర్వహించి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ వేడుకకు హాజరైన భక్తులు, గ్రామస్తులకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్, సీఏడీఏ కమిషనర్ శెట్టిపల్లె రాంసుందర్‌రెడ్డి, సీవీ సుబ్బారెడ్డి, సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

50 రోజుల తర్వాత మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రొద్దుటూరు : సాధారణంగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని ప్రతి నెలా నిర్వహించాల్సి ఉంది. అలాంటిది ఫిబ్రవరి నెలలో అసలు సమావేశం నిర్వహించలేదు. 50 రోజుల తర్వాత శనివారం ఉదయం సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ప్రభావం కారణంగా పరిపాలన విషయంలో ప్రజలకు కొన్ని ఇబ్బందులు కలిగాయి.

జనవరి అజెండాపై కోర్టుకు ..

ఈ ఏడాది జనవరి 31వ తేదీన నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో తనకు జరిగిన అవమానంపై మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి మున్సిపల్ ఉన్నతాధికారులకు లేఖ పంపారు. వారి నుంచి ఇంకా నిర్ణయం వెలువడకపోవడంతో హైకోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. 31వ తేదీన జరిగిన మున్సిపల్ బడ్జెట్ కౌన్సిల్ సమావేశానికి చైర్‌పర్సన్ హాజరయ్యారు. బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. తర్వాత నిర్వహించాల్సిన సాధారణ సమావేశాన్ని చైర్‌పర్సన్ వాయిదా వేశారు. వాయిదా విషయాన్ని కూడా చైర్‌పర్సన్ ముందుగా కౌన్సిల్ సభ్యులకు సమాచారం అందించారు. ఎక్స్‌అఫిషియో మెంబర్ హోదాలో హాజరైన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి చైర్‌పర్సన్ వెళ్లిన అనంతరం తన వర్గీయుడైన కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డిని ప్యానల్ చైర్మన్‌గా అక్కడికక్కడే ఎన్నుకోవడం ఆయన ద్వారా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు చేసిన విమర్శలపై చైర్‌పర్సన్ తీవ్ర మనస్తాపం చెందారు. తనకు జరిగిన అవమానం, అన్యాయంపై మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి కలెక్టర్‌తోపాటు డీఎంఏ, ప్రిన్సిపల్ సెక్రటరీలకు ఫిర్యాదు చేశారు. అధికార పార్టీ ప్రభావం కారణంగా ఈ విషయంపై జాప్యం జరుగుతుండటంతో ఆమె కోర్టును ఆశ్రయించారు. ఇప్పటి వరకు ఈ విషయంపై ఎలాంటి నిర్ణయం వెలువడలేదు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ముక్తి రామలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్ నారాయణ హృదయాలయ ఆస్పత్రికి చెందిన డాక్టర్ అంజనీకుమార్‌తో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాజారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మోకాళ్లు, నడుము, కీళ్ల నొప్పులు తదితర వాటికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని, రాయి తీపై ఎక్స్‌రే తీస్తారని ఆయన పేర్కొన్నారు.

రేపు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 23న ఆదివారం ఉదయం 9 నుండి సాయంత్రం 3 గంటల వరకు బైరెడ్డి సూర్యనారాయణరెడ్డి, సుశీలమ్మ ట్రస్టు వ్యవస్థాపకులు హైకోర్టు లాయర్ లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శుక్రవారం నిర్వాహకులు తుపాకుల శ్రీనివాసులు, ల్యాబ్ రామమోహన్‌రెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో చెన్నై, పాండిచ్చేరి, రాయవేలూరు, నెల్లూరు, హైదరాబాదుకు చెందిన ప్రముఖ వైద్యులు పాల్గొంటారన్నారు. మహిళల అన్ని రకాల అనారోగ్య సమస్యలు, గర్భాశయ పరీక్షలు, సంతానం లేని దంపతులకు ప్రత్యేక పరీక్షలు, ఉచిత స్పెర్మ్ పరీక్షలు నిర్వహించి, సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉచిత వైద్యంతో పాటు ఉచిత మందులు కూడా ఇస్తారన్నారు. వివరాలకు 7386230697, 63042727551 సంప్రదించాలన్నారు.

ఉక్కు పరిశ్రమ నిర్మాణంతోనే అభివృద్ధి

ప్రొద్దుటూరు రూరల్ : కడప ఉక్కు పరిశ్రమపై నైతిక నిబద్ధత లేని ప్రభుత్వాలను ప్రజలు ప్రశ్నించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నిలదీయడం లేదన్నారు. రాయలసీమ అభివృద్ధి చెందాలంటే కడప ఉక్కు పరిశ్రమను నిర్మించాల్సిందేనన్నారు. ఈనెల 26న ప్రొద్దుటూరు ఎన్జీఓ హోంలో కడప ఉక్కు పరిశ్రమపై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అందరూ పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

నేడు ఉపకార వేతనాలు పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొర్రపాడు రోడ్డులోని కేసీపీ ఫౌండేషన్ ఎస్టేట్‌లో కేసీ పుల్లయ్య త్రయోదశ వర్ధంతి సంస్మరణ సభ, 500 మంది పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ, కేసీ పుల్లయ్య జాతీయ స్మారక పురస్కారాలను పంపిణీ చేయనున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు కృష్ణవేణమ్మ, అనిల్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత, ప్రణవ్ గ్రూప్ వ్యవస్థాపకుడు జూటూరు రవికుమార్, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు టంగుటూరు మారుతిప్రసాద్ పాల్గొంటారని వారు తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

దానగుణానికి పేరొందిన రంజాన్



రంజాన్ తోఫా అందచేస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : పోరుమామిళ్లకు చెందిన టింగిరి హసన్‌సాహేబ్ (గోల్డ్‌షాపు) ఆధ్వర్యంలో శుక్రవారం ముస్లిం పేదలకు రంజాన్ తోఫాగా నిత్యావసర వస్తువులు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి చేతుల మీదుగా అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మనిషిలోని చెడుభావాలను, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపుతూ మానవాళికి హితాన్ని బోధించే పండుగ రంజాన్ అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూతు కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, జిల్లా ప్రచార విభాగ అధ్యక్షుడు రాజీవ్‌బాషా, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ రాల్లపల్లె నరసింహులు, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు పాదిలి మస్తాన్, విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు సాయినారాయణరెడ్డి, హసన్ బ్రదర్స్ పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం ఉదయం 11 గంటలకు అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆమె కోరారు.

ఉపాధి పనుల పరిశీలన

బ్రహ్మంగారిమఠం : మండలంలోని సోమిరెడ్డిపల్లె పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఎంపీడీఓ వెంగమునిరెడ్డి పరిశీలించారు. ఉపాధికూలీలకు కావాల్సిన సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే చెత్త సేకరణ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈఓ పీఆర్డీ రేకలకుంట గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శి సురేష్‌బాబు, ఉపాధి ఏపీఓ కృష్ణ, ఈసీ జగన్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల సమగ్ర అభివృద్ధే లక్ష్యం

చాపాడు : అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల సమగ్ర అభివృద్ధే లక్ష్యంతో పని చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ సావిత్రమ్మ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో శుక్రవారం చాపాడు, దువ్వూరు మండలాలకు చెందిన అంగన్వాడీ వర్కర్లకు రెండో రోజు పోషణ్ బీ.. పడాయ్ బీ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు పిల్లల సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం ఇచ్చే సూచనల మేరకూ పిల్లలకు విద్యా బుద్ధుల నేర్పించడంతో పాటు వారికి అందించాల్సిన ఫుడ్‌ను అందచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నీటి వృధాను ఆపుదాం

ప్రొద్దుటూరు : జలం లేనిదే.. జీవం లేదు. రోజు రోజుకు పెరుగుతున్న భూతాపం వల్ల నీటి లభ్యత తగ్గి నీటి సమస్య మరింత తీవ్రం కానుందని అంతర్జాతీయ వాతావరణ అధ్యయన సంస్థ నివేదిక చెబుతోంది. ఇప్పటి పరిస్థితుల్లో మరో 2–3 డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగితే ప్రపంచ వ్యాప్తంగా 40 శాతం ప్రజలు నీటి కొరత ఎదుర్కోవాల్సి వస్తోందని నివేదిక స్పష్టం చేస్తోంది. మానవ శరీర అవయవాలు వాటి క్రియలను, విధులను నిర్వర్తించడానికి నీరు తప్పనిసరి అవసరం. కానీ జనాభా అవసరాలకు తగ్గ నీటి లభ్యత కావడం లేదు. ఇందుకు కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోవడమే. సాగు, తాగు నీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి వృథాపై అప్రమత్తం కాకపోతే నీటి కొరతతో విలవిలలాడాల్సిందే. వాతావరణంలో వస్తున్న మార్పులే నీటి కొరతకు ప్రధాన కారణమని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు.

నీటి వృధాను అరికడుదాం ఇలా..

- టూత్ బ్రష్ నోట్లో పెట్టుకున్నప్పటి నుంచి పళ్ల తోముకోవడం పూర్తయ్యే వరకు సింక్‌లో పంపు తిప్పి వదిలేసే అలవాటు చాలా మందికి ఉంటుంది. దంతధవనం సమయంలో నీటిని సరిగా వాడగలిగితే రోజుకి 2 లీటర్ల నీటిని ఆదా చేయవచ్చు.
- డ్యూయల్ ఫ్లష్ ఉన్న టాయిలెట్లు కట్టించుకుంటే ప్రతి ఏడాది కొన్ని వేల లీటర్ల నీటిని ఆదా చేయవచ్చు.
- చాలా మంది వేడి నీళ్ల ఎక్కువ తిప్పేసుకుని ఆ తర్వాత చన్నీళ్ల కలుపుకొంటుంటారు. బకెట్‌లో చోటు లేక సగం పారబోస్తుంటారు. కాస్త చూసుకుంటూ సమపాళ్లలో తిప్పుకుంటే నీటి వృధాను అరికట్టవచ్చు. షవర్ బాత్ చేసేదానికంటే ఎక్కువ టబ్ బాత్ చేసినప్పుడు నీరు వృధా అవుతుంది.
- పంపును అలాగే తిప్పి ఉంచి పాత్రలు కడుక్కోవడం, బట్టలు ఉతుక్కోవడం వల్ల కూడా నీటిని వృధా చేస్తుంటారు. ఈ విధంగా వృధా చేయకుండా నీటిని పొదుపుగా వాడుకోవాలి.

